ఊరిపేరు నర్సన్నపేట.

పల్లెపేరు పోచంపలె.

ఈరెండూ కలిసిలేవు. కాని రెండిటికీ కలిసి ఒకటే పాఠశాల.

నర్సన్నపేటకు తూర్పు దిక్కున ఫర్లాంగు దూరంలో చిన్నవాగు పారుతూంది. వాగుకు అటువైపున అంతగా ఎత్తులేని కంకరరాళ్ళ గుట్ట ఉంది. గుట్టకు ఆవలివైపున దాదాపు నాలుగు ఫర్లాంగుల దూరంలో పోచంపల్లె ఉంది.

రెండు సంవత్సరాల్క్రితం వరకూ నర్సన్నపేటలో మాధ్యమిక పాఠశాల, పోచంపల్లెలో ప్రాథమిక పాఠశాల ఉండేవి. నర్సన్నపేటలోని పాఠశాల ఒక భూస్వామి అద్దె కొంపలో నడిచేది. భూస్వామి మరణించడం వల్ల ఆయన కొడుకులు వేరు పడ్డారు. తండ్రి సంపాదించిపోయిన ఆస్తిని పంచుకున్నారు. పాఠశాల ఉండే ఇల్లు ఓ కొడుకు వైపుకు వచ్చింది. ఆయన ఆ ఇంటిని పశువుల కొట్టంగా ఉపయోగించుకోవాలనుకున్నాడు. వెంటనే ఖాళీ చేయమని అధికారులకు నోటీ సిచ్చాడు.

పాఠశాలకు సరిపోయే ఇల్లు మరొకటి అద్దెకు దొరకలేదు. అప్పుడు కొత్తభవనం కట్టవలసి వచ్చింది.

ఫలితంగా వాగు ఒడ్డున, గుట్టకింద రైలు డబ్బాల్లాంటి పాఠశాల భవనం కట్టబడింది. అప్పటి వరకూ కూలిపోతున్న గడ్డిపాకలో నడుస్తున్న పోచంపల్లె పాఠశాలను కూడ దీంట్లోనే కలిపేశారు.

నర్సంపేట పిల్లలు బడికిరావాలంటే వాగుదాటి రావాలి. వానాకాలం నాలుగు నెలలూ చిన్న పిల్లలు బడికి రావడానికే వీలుండదు. పెద్ద వర్షంపడి బాగా వరద వచ్చిన రోజు పాఠశాలకు సెలవన్నమాటే. ఇక పోచంపల్లె పిల్లలు రావాలంటే పొడుగూతా పాములా పడుకునిఉన్న గుట్టనుచుట్టిరావాలి. చిన్న పిల్లలు అంత దూరం నడిచి రావడం అంటే మామూలు కాదు. కాని కిరాణా కొట్లలో కూడ ప్రజాస్వామ్యాన్ని కొనుక్కో వీలున్న ఈ దేశంలో ఏది మామూలుగా ఉందని ఇది ఉంటుంది?

కొత్త స్కూలు భవనం కట్టబడ్డ భూమి. ఆ భవనం కట్టబడక ముందు నర్సంపేట పంచాయితీ ప్రెసిడెంటు రామిరెడ్డిది. రాళ్ళతో, ముళ్ళ పొదలతో నిండి వుండి. పశువులు మేసే గడ్డికూడ పెరగక పోయేది ఆ భూమిలో.

స్వాతంత్ర్యానికి పూర్వం ఆ భూమి ఒక తురక జమిందారుది. రామిరెడ్డి తండ్రి ఆయన



# చేను-కంచె-కాపరి

బాబురావు

బడ్డ గుమాస్తాగా పనిచేసేవాడు. రజాకార్ల కాలంలో తురక జమీందారు హిందువుల పట్ల చాలా ఘాతు కాలు జరిపించాడు. తీరా ఆనాటి హైదరాబాదు రాష్ట్రం భారత యూనియన్‌లో కలిసి పోయినప్పుడు తన ఘాతుకాలకు గురియైన హిందువులకు భయపడి పాకిస్తాన్‌కు వెళ్ళిపోయాడు. విదేశాల్లో ఉన్న కొడు కులు తిరిగి వచ్చే సరికి పరిస్థితి చాలా వరకు అస్త వ్యస్తమైంది.

ఆ అనుకూల సమయంలోనే రామిరెడ్డి తండ్రి బాగా సంపాదించాడు. ఆ సంపాదనలో స్థిరాస్తి, చరాస్తి - రెండూ ఉన్నాయి. ఆ విధంగా లభిం చిన భూముల్లో ఈ రాళ్ళ భూమికూడ ఒకటి.

ఏదైనా పైరు వేద్దామంటే 'ఓమ'కూడ పండదా భూమిలో. ఎవరికైనా అమ్మివేద్దామంటే తొండలు కూడ గుడ్లుపెట్టని ఆ భూమిని కొనేది. ఎవరు?

తండ్రి పరిష్కరించలేని ఈ సమస్యను రామిరెడ్డి చిటికలో పరిష్కరించేశాడు. పరిష్క రించి పుణ్యమూ, పురుషార్థమూ-రెండూ దక్కించు కున్నాడు.

ఊళ్లో భూమినమ్మడానికి ఎవరూ ముందుకు రావడంలేదనీ, ఊరిలోపలి భూమిధరలో సగం ధరకే తన భూముని అమ్మటానికి, ఆరోగ్యకర మైన ప్రశాంత వాతావరణంలో స్కూలుకట్టిస్తే బాగుంటుందనీ, తన భూమిలో స్కూలు కడితే ప్లేగ్రౌండు సమస్యకూడ పరిష్కారమౌతుందనీ.. ఇవన్నీగాక ఈ భూమి సర్పంచేటకూ, పోలీసు పట్టెకూ మధ్యనుంది కాబట్టి రెండూళ్ళకూ సవిక వస్తుందనీ ముందు ముందు మాధ్యమికపాఠశాల, ఉన్నత పాఠశాలగా మారితేపోయినా కావలసినన్ని షెడ్లు వేసుకోవచ్చుననీ - ఇంకా బోలెడన్ని కార ణాలు చూపెడుతూ దరఖాస్తు పెట్టుకున్నారు సమితి ఆఫీసులో.

అధికారులువచ్చి చూశారు. ప్రెసిడెంటు పేర్కొన్న ప్రతి ఒక్క కారణమూ వాళ్ళకు దివ్యంగానూ, వాస్తవికంగానూ కనిపించింది. సగం ధరకే తన భూమిని అమ్మడంలోగల రామిరెడ్డి ఉదారత, ప్రజాసేవా తత్పరత వాళ్లను తన్మయుల్ని చేశాయి. ఆలస్యంలేకుండా ఆమోద ముద్ర గుద్దేశారు.

ఇకనేం స్కూలు భవనంలేచింది. రామిరెడ్డి ఉదారత పునాదిరాళ్ళైతే, కంట్రాక్టర్ల వినాశర్థం ఇటుకలుకాగా అది పూర్తయింది.

ఇది పాఠశాల భవనం కథ.

పాఠశాల కథ వేరే ఉంది—

* * *

ప్రార్థన వేళ అది.

ఎంత మండిపోతూ ఉంది. ఎండలో పాఠశాల తెల్లగా ప్రకాశిస్తూంది.

పాఠశాలకు పాఠశాలంతా కోలాహలంగా ఉంది. ఒక రూంలో ఇంగ్లీషు, ఒక రూంలో హిందీ, ఒక రూంలో భూగోళం, ఒక రూంలో చాకాభానీ— జరుగుతున్నాయి.

హెడ్మాస్టరు రూంలో హెడ్మాస్టరు కూర్చుని వేదకాలంనాటి విద్యా విధానం గురించి మాట్లాడు తున్నాడు. వెంట్రుకలు తెల్లబడ్డ తల్పద్దాల ఉపా ధ్యాయుడు ఒకాయన నోరుతెరచి వింటున్నాడు.

హెడ్మాస్టరు వయసు నలభై ఏళ్ళ లోపు. ఆయ నవి-నల్లని శరీరం, పొట్టి విగ్రహం, ఖడ్గమృగాన్ని తలపింపజేసే కండరాలు, దొడ్డు పెదవులు, టూత్ బ్రష్ మీసాలు, గుబురైన కనుబొమ్మలు, ఏనుగు కళ్ళు, ఏనుగువే చెవులు, మధ్య పాపిట, పాపిటకు అటూ యిటూ ఊగే పక్షి రెక్కల్లాంటి వెంట్రు కలు, నవ్వితే కనబడే పాచిపళ్ళు, కోపం వస్తే తొండలా క్రిందికీ మీదికీ ఊగే వెడల్పాటి ముక్కు పుటాలు. చిన్న నుదురు, నుదుటి మధ్య నన్నని తిరుమణి బొట్టు.

ఆయన మోచేతులనుదాటిన చేతులుగల టెరిలీన్ బుష్షర్టు తొడుక్కున్నాడు. పైజామాలాంటి తెల్లని పాంటు తొడుకున్నాడు. ఖరీదైన ఆకుచెప్పులు ఆయన పాదాలను అలంకరించి ఉన్నాయి. ఎడం చేతికి ఖరీదైన వాచీఉంది. ఒక్కొక్క చేతికి రెండేసి చొప్పున నాలుగు ఉంగరాలు (బంగారువి) ఉన్నాయి.

మాటలమధ్యలో ఆయనకు ఆవలింత వచ్చింది. ఆవలించి షర్టుగుండీతీసి కుర్చీలో వెనక్కు జేరగిల బడ్డాడు. 'అబ్బబ్బ- ఏం ఎండ. ఏం వేడి!' అంటూ ఆపసోపాలు పడుతూ ఫ్యాన్ని విలిచి మంచినీళ్ళు త్రాగాడు.

మంచినీళ్ళు తాగి ఎదురుగా గోడకు వ్రేలాడు తూన్న గాంధీజీబొమ్మను చూస్తూ అన్నాడు. 'ఒక్కొక్కసారి మనమెన్ని చేసినా లాభంలేకుండా పోతుందండీ. అబ్బే. ఏ కాలమైనా మనిషి మనిషే. మట్టిలోపుట్టి మట్టిలోనే కలిసిపోయే మట్టిబొమ్మ. ఈ మట్టిబొమ్మను తన ఇష్టంవచ్చినట్లు ఆడిస్తాడు భగవంతుడు. అంతా ఆయన విలాసం. ఆయన దయలేంది ఏ పని చేయగలం? చివరికి పూచిక పుల్లకూడ కదపలేం. అంతేకదా ప్రపంచంలో జరుగుతున్నది...' నాకు మొదట్లో దేవునిమీద అంతగా నమ్మకం ఉండేదికాదు. కాని ఓనాడు హఠాత్తుగా ఆయన నన్ను తన ఒళ్ళోకి తీసుకునే సరికి ఆశ్చర్యపోయాను. నాకళ్లు తెరుచుకున్నాయి. అప్పటినుండి ఆయన చల్లనిచూపు నన్ను కాపాడు తున్నది.

"రోజూ అరగంటైనా పూజచేయంది నాకు అన్నంకాదు. మీకు తెలిసేవుండనుకుంటా, బడువందలు పెట్టి పూజకు కావల్సిన అన్ని సామాన్లు కొన్నాను. అన్నీ వెండివే. దేవునిగుడిలో దీపం వెలిగించి కళ్ళు మూసుకుని చేతులు జోడించి - "భగవయ్యా! ఇంకా ఎక్కువగా నా బడిపిల్లలకు సహాయపడే విధంగా నాకు కావల్సిన శక్తిసామర్థ్యాలను ప్రసా దించు." అని రోజూ మొక్కుకుంటాను."

ఆయన చిన్నకళ్ళు అరమోడ్పులయాయి. నుదుటిమీది బొట్టు ఆయనమాటలకు లిఖితరూపంగా మెరుస్తున్నది.

కళ్ళద్దాల మేష్టారు అన్నారు. "అంతేకదండీ మరి. మనకు సంసారాలున్నా, పిల్లలూ, పీచూవున్నా బడికి వచ్చే పిల్లలకు చదువును దానంచేసి వాళ్ళను తీర్చి దిద్దవలసినపని మనదే కదా."

గోడపైన గాంధీజీ వీళ్ళమాటలకు అతీతంగా వెన్నెల ప్రవాహంలాంటి నవ్వు నవ్వుతున్నాడు.

ఇంకా ఏదో చెప్పబోయే వాడల్లా ద్వారం వైపుచూసి కళ్ళద్దాల మేష్టారు ఆగిపోయాడు.

యువకుడైన మరో ఉపాధ్యాయుడు దాదాపు పదేళ్ళున్న బాలుణ్ణి బరబరా ఈడ్చుకువచ్చాడు.

ఆ బాలుని కళ్ళలో భయం రెపరెప లాడు తున్నది. నోరు తెరచి ఉంది. పెదవులు వణుకు తున్నాయి. తైలసంస్కారంలేని జుట్టు నారపీచులా ఉంది. చిరిగిన చొక్కాకున్న రెండు గుండీలూ ఊడిపోగా కంఠెబొక్కలు స్పష్టంగా కనిపిస్తు న్నాయి. దుమ్ముకొట్టుకున్న కాళ్ళనిండా పొక్కులు కట్టిన పెద్దపెద్ద పుళ్ళున్నాయి. వాటిమీద ఈగలు ఆడుకుంటున్నాయి. జారిపోతున్న రంగుపోయిన లాగును ఎడంచేత్తో పట్టుకున్నాడు. వాని కుడిచేయి టీచరు కబంధ హస్తంలో నలిగిపోతున్నది.


వాడిని చూస్తూనే హెడ్మాష్టరు ముఖకవళికలు మారిపోయాయి. అసహ్యంతో ఆయన పెదవులు అష్టవంకర్లు తిరిగాయి. కళ్ళు మూసుకుపోయి మరీ చిన్నవయ్యాయి.

'ఏమిటి?' —అన్నట్లు యువక మేష్టారువైపు చూశాడు.

సంగతేమిటో వివరించే ముందు ఆ ఉపాధ్యా యుడు బాలుడిని ఒక్క గుంజు గుంజాడు. ఆ విసురుకు వాడు హెడ్మాష్టరు దగ్గరగా వచ్చి, పడ బోయి నిలదొక్కుకున్నాడు.

యువక మేష్టారు కుర్చీలో కూర్చుంటూ అన్నాడు హెడ్మాష్టరుతో,

'వీడెవడనుకున్నారు? ఈ స్కూలు బిల్డింగ్ ఇనాగ్రేషనప్పుడు తనకు అందరితోపాటు 'టీ' పొయ్యలేదని, గడబిడ చేసిందు - జ్ఞాపకం ఉందా- వాని కొడుకు.'



"వివాహ సమయంలో భార్యాభర్తల చేతులు కలుపుతారు ఎందుకు?" అన్న సందేహం వచ్చింది ఓక బ్రహ్మచారికి.

"కుస్తీపట్టడానికి ముందు ఒకరి కొకరు చేతులు కలుపుకుంటారుగదా. అలాగే యిదీ మొదటిమెట్టు" అన్నాడు ఓ గృహస్థు.

'ఎవడు? ...ఆఁ..అఁ— వాడా వానికొడుకా వీడు?'

హెడ్మాష్టరుకు అర్థమయింది.

'ఐతే ఎందుకు తీసుకొచ్చినవ్ వీణ్నిక్కడికి?'

'షోరడిప్పుడే తండ్రిని మించిన వాడయిండు. వీని మాటలు మీరే గనుక వినిఉంటే విలువూతా చీల్చి పాతేద్దురు. నాక్కూడ కోపం ఆగలేదు. కాని స్కూలుకు సంబంధించిన విషయం గనక మీముందరికే తీసుకురావాలని చెప్పి లాక్కవచ్చిన'

'ఇంతకూ వీడన్నదేంటి?

'నేను అప్పుడే క్లాసులోకి అడుగు పెడుతాన్న. వీని మాటలువినిపించి తలువుల్దగ్గర్నే ఆగిపోయిన. బెంచీపై పిల్లలందరికి ఎదురుగా కూర్చుని దేశ నాయకునిలా చెప్తున్నాడు. మనకెందుకు పెట్ట్రరా? పెట్టరు. ఉప్మా పెట్టరు. పాలు పొయ్యరు. ఎందుకు పొయ్యరో మా అయ్య ఎవత్తోనా చెప్తాంటె ఇన్న నేను. సమితి అఫీసు నుంచి నెల కోటా తెచ్చుడు ఖరాబరేనట – కాని మనకు నెల మొత్తంమీద వారం రోజులున్న పాలుపోత్తాంరా? అమెరికా వోళ్ళు మనకోరకని పంపుతాంటె, వీళ్ళేమో అమ్ముకుంటున్నరట. ఒక బస్తాకు ఇన్నూర్రూపాయిలట. ఇక ఉప్మా పిండి మన హెడ్మాష్టరు ఇంట్ల వాళ్ళ బర్రెకు పెట్టంగ నా కళ్ళతో నేంజూసిన... —అయ్యయ్యో ఏం మాటలండీ అవి? ఒక్క మాటన, రెండుమాటలా..

ఒక్కొక్క మాటను యువక మేష్టారు అభినయించి చెబుతూంటే హెడ్మాష్టరు కనుబొమ్మలు పైకిలేచి కళ్ళు కోపంతో ఎరుపెక్కసాగాయి. పెదవులు ముడుచుకుపోయి దవడ ఎముకలు పొంగాయి. ముక్కు పుటాలు పైకి లేచాయి.

ఆయన తనకోపం అపుకోలేకపోయాడు. అపుకోవలసిన అవసరం కూడ లేదు.

అపరాధిగా నించున్న బాలుడు షాహుకారు కొడుక్కాడు. భూస్వామి కొడుక్కాడు. పంచాయితి ప్రెసిడెంటు కొడుకు అంతకన్నా కాడు. కూలి చేసుకుని పొట్టపోసుకునే అనామకుడైన ఒక నిర్భాగ్యుని కొడుకు వాడు.

హెడ్మాష్టర్ కుర్చీపక్కన గోడకానించి ఉన్న బెత్తాన్ని తీసి టేబుల్‌పై చరిచి అరిచాడు కోపంతో. "నిజం చెప్పు. లేకుంటే తోలు ఒల్చేస్తా. అన్నావా అట్ల?"

వాడు అన్నమాట నిజమే. కాని తన మాటలు ఎంతవరకు నిజమో తెలుసుకుని నిరూపించగలిగే వయసు కాదు వానిది. ఇకనేం మాట్లాడుతాడు?

గడ గడ వణుకుతూ బేలగా, జాలిగా నించున్నాడు.

— తప్పు చేశాడు. శిక్షించక తప్పదు.

హెడ్మాష్టరు కుర్చీనుండి లేచాడు.

'చేయి చాపు.'

'.........'

'ఊఁ. తొరగా. లేకుంటే వీపు పగుల్తది.'

బాలుడు వణుకుతున్న చేయిని చాచాడు. ఆ అరచేతిలో వాని పంచ ప్రాణాలూ కేంద్రీకృతమై ఉన్నాయి.

హెడ్మాష్టరు చేయి పైకి లేచింది. 'షిప్' — మంటూ చింత బెత్తం వచ్చి బాలుని అరచేయిని తాకింది. వాడు బాధగా మూలిగాడు. ఏడ్పు గొంతులోనే ఆగిపోయింది. చేతి వ్రేళ్ళు ఊడిపోయినట్లే అనిపించింది.

'అది, ఆ చెయ్యి.'

— షిప్ ......

'ఇది, ఈ చెయ్యి.'

— షిప్ ......

ఇట్లా ఎన్నిసార్లో లెక్కలేదు. చింతబెత్తం కుదా కునకలయింది. బాలుని చేతులు రక్తపుముద్ద లయ్యాయి. వాని కళ్ళనుండి ధారలుగా కన్నీరు కారుతున్నది.

'ఇకముందు ఇట్లాంటిమాటలు మాట్లాడతావా?'

మాట్లాడనన్నట్లు వాడు తలూపాడు.

'నోటితో చెప్పు' – విరిగినబెత్తం చివరవాని కాళ్ళను పరామర్శించింది. ఆ పరామర్శకు పొక్కులు కట్టిన పుండ్లు చిట్లి రక్తం చిమ్మింది. ఇంతసేపు ఓర్చుకున్న బాలుడు ఈ దెబ్బకు మాత్రం ఓర్చుకోలేకపోయాడు. గొంతులో ఆగిపోయిన ఏడ్పు ఎగిసివచ్చింది. బావురుమంటూ క్రింద కూలబడిపోయాడు.

'గోడమీది బాపూజీ ఇది గమనించినట్లు లేదు ఎప్పటిలాగే నవ్వు వెన్నెలలు కురిపిస్తున్నాడు. 'చెప్పు'– ఇటువంటి మాటలు మాట్లాడనని చెప్పు బెత్తం గాలిలో ఊగుతున్నది.

'మాట్లాడ... మాట్లాడ... మాట్లాడ.'

'ఛీ రాస్కెల్. ఇక్కన్నుంచి పో.'

బాలుడు లేచి నడుగత్తాడు. వాడు వెళ్ళింది క్లాసురూంలోకికాదు. వాగువైపుకు వెళ్ళాడు వాడు.

ఇంకా పన్నెండుకాలేదు. ఐనా ఎండ చాలా తీక్షణంగాఉంది. వాగులోని ఇసుక కాళ్ళకు అంటుకుని పాదాలు భగ్గుమంటున్నాయి.

బాలుడు వాగుమధ్యన కూలబడ్డాడు. శరీరం కాలుతున్నా లెక్కచెయ్యలేదు. వెక్కి వెక్కి ఏడుస్తూ ఒక చేతివ్రేళ్ళను ఇంకో చేతివ్రేళ్ళలో ఇరికించి, రెండు చేతుల్నీ ఒక్క పిడికిలిగా పట్టుకుని కుప్పగా పడిఉన్న ఇసుకను అదేపనిగా గుద్దసాగాడు. చేతులు చితికిపోయాయి. ముచ్చెమటలు పోశాయి. దుఃఖమూ, క్రోధమూ పూర్తిగా అణగారేవరకూ వాడు అట్లా గుద్దుతూనే వున్నాడు.

తర్వాత లేచివెళ్ళి వాగులో ఒకపక్కన పారుతున్న సన్నని కాలువలో మొగమూ, కాళ్ళూ కడుక్కున్నాడు. కందిన చేతులనూ, చితికిన పుండ్లనూ చూసుకుంటూంటే వానికి మళ్ళీ దుఃఖం వచ్చింది. బలవంతాన ఆపుకున్నాడు. చెలమచేసుకుని నీళ్లు త్రాగి వాగు ఒడ్డునవున్న తుమ్మచెట్టు నీడలో కూర్చున్నాడు.

కొద్దిసేపటికి గంటమ్రోగింది. పిల్లలు ఇంటిదారి పట్టారు. బాలుడు వాళ్ళలో కలిశాడు.

"ఏందిర, పారు ఎన్ని పిప్పరమెంట్లిచ్చిండు?" బాలుడు క్లాసులో వదిలి వచ్చిన పుస్తకాల సంచీని తెచ్చి ఇచ్చి అన్నారు వాని స్నేహితులు.

బాలుడు మాట్లాడలేదు. మౌనంగా నడక సాగాడు.

మరొకడన్నాడు, "పిప్పరమెంట్లు కాదురా, మిరపకాయబజ్జీలు."

పక్కనే అక్కచేయి పట్టుకుని నడుతూ లేస్తూ నడుస్తూన్న లాగు కొడుక్కొని బడాలేళ్ళ ఓ అబ్బాయి అంటున్నాడు—

"సోరి, నువ్వెప్పుడు అబద్దమె చెప్తవు. పాలు పోత్తరని చెప్పినవు ఇంటికాడ. పాలు పొయ్యలేదు. పిండి పెట్టలేదు. రేపు నువ్వు వచ్చినాగాని బడికి రాను."

బాలుడు అతనివైపు చూశాడు. వానికి మళ్ళీ దుఃఖం వచ్చింది.

* * *

రాత్రి పదకొండు గంటలు దాటింది.

ఊరు మాటు మణిగింది.

ఆకాశం నిండా దూది పింజాల్లాంటి మబ్బులు తేలిపోతున్నాయి. వాటి చాటునా సప్తమిచంద్రుడు వెలిగీ వెలగనట్లు వెలుగుతున్నాడు. ఎండాకాలం సమీపిస్తున్నా ఇంకా చలి తగ్గలేదు. పాతకాల ఆ గుడ్డి వెన్నెలలో దూరాన్నుండి చూస్తే సగం కట్టి వదలివేసిన గోరీలా ఉంది

ఆ సమయంలో పాతకాలకు కుడివైపున గదులు సరిపోకుంటే వేసిన గుడిసెలో వ్యాపించిఉన్న చీకట్లో మూడు చుట్టలు వెలుగుతున్నాయి.


కొద్ది దూరంలో వాగు ఒడ్డు, తుమ్మచెట్లు, వాటి వెనక ఊరు మసక మసకగా కనిపిస్తున్నాయి. ఊళ్ళోనుండి అప్పుడప్పుడు కుక్కల అరుపులు తప్ప ఏలాంటి శబ్దాలూ లేవు. కీచురాళ్ళ

---

ఓ సినిమాహాల్లో యిద్దరు ఆడవాళ్ళుకూర్చుని ఒకే తీరున మాట్లాడుకుంటున్నారు. ప్రక్కవాళ్ళకి సినిమాలో మాటలు ఏమీ వినిపించటంలేదు.

ఒకతను: "ఏమమ్మా! మీ మాటల్లో మాకేమీ వినిపించటంలేదు" అన్నాడు

"మేం మాట్లాడుకునేది మా స్వంతవిషయాలు. నీవెందుకు వినాలి" అని యిద్దరూ తగాదాకి దిగారు.



## వృషభపూజ (ఏరువాక పౌర్ణమి)



చిత్రం : మాదేమంచి శ్రీనివాసరావు.

అదేపనిగా గీపెడుతున్నాయి. కంకరరాళ్ళ గుట్ట అవతలివైపున నక్కలు ఏడుస్తున్నాయి.

పాకలోని మూడు చుట్లలో ఒక చుట్ట ఆరిపోయింది.

"దీనియవ్వ...పువాకు కతమైఁది"- అన్నాడు ఆ చుట్టమనిషి.

మిగతా రెండు చుట్టల మనుష్యులు ఏమీ మాట్లాడలేదు.

మళ్ళీ ఆరిపోయిన చుట్టమనిషే అన్నాడు. "మీ వఁన్న నుసుంటె జర పెట్టుంఁడి."

"మని లేదు, గనిలేదు. నప్పుదేక కూకో"- అన్నాడు రెండో మనిషి.

ఆ ముగ్గురి శరీరాలు గుడిసెలో వ్యాపించి ఉన్న నల్లని చీకటిలో మరింత నల్లగా ఉన్నాయి, వాళ్ళవి. పెద్దపెద్ద తలపాగాలు. అంగీలులేని కండరాలు దేరిన శరీరాలు. భుజాలపై కప్పుకున్న నల్లని గొంగళ్లు.

ఎప్పుడో త్రాగిన కాటికల్లు మత్తు క్రమ క్రమంగా దిగిపోతున్నది. జొన్నగడకతో. చిక్కని అంబలితో సందు లేకుండా నిండి ఉన్న కడుపులు. పనిచేసి అలసి పోయిన శరీరాలు విశ్రాంతి కావాలంటున్నాయి. ఎంత ప్రయత్నించినా కంటి రెప్పలు విలవడం లేదు. రాత్రి గడుస్తున్న కొలదీ చలి ఎక్కువౌతున్నది. భుజాలమీది గొంగళ్లను పూర్తిగా విప్పి శరీరంనిండా కప్పుకున్నారు.

నిశ్చల నిశ్శబ్దంలో ఒక్కొక్క క్షణమే కరిగిపోతున్నది.

ఆ ముగ్గురు అసహనంతో చిటపటలాడసాగారు.

'మీరిద్దరచ్చి పిల్సెప్పటికే అచ్చినగాని లేకుంటే రాకపోదు?'— అన్నాడు మొదటి మనిషి.

'పున్నాని కచ్చేనల్లె మాట్లాడుతున్నావేంది? రెంౘ్రూపాయలు తీసుకున్నావ్."-అన్నాడు రెండో మనిషి.

"తీసుకోలేదన్న? తీసుకున్న నిజవేఁ. రెండిట్ల రూపాయ పావుల కల్లుకేపాయె. తతిమ్మ మూడుప్పక్కలకు మూడురెమ్మల పువాగూడ రాదు."

కునికిపాట్లు పడుతున్న మూడోమనిషి అన్నాడు. ఆవులిస్తూ, "రెంౘ్రూపాయెలేమోగాని పానం పోతున్నది. మా యింటిది ఈ పూళ్ళంటె సచ్చినా రాకపోదు."

మళ్ళీ కొంతసేపు నిశ్శబ్దం రాజ్యం చేసింది వాళ్ళమధ్య.

మిగతా ఇద్దరి చుట్టలుకూడ ఆరిపోయినై.

గుంజకు చేరగిలబడ్డవాడల్లా లేచిసరిగా కూర్చుని మొదటివాడన్నాడు.. "ఐలే లంగముండకొడుకు."

'ఎవరు?'— రెండోవాని ప్రశ్న.

'సర్పంచి రావిఁరెడ్డా?'— మూడో వాని ఉత్సుకత.

'పెద్దపంతులు రాఁ చంద్రమ్మా?'— రెండో వాని కుతూహలం.

'ఇద్దరు గూడా...'—సమాధానం.

'తాజా—ఒకనికన్న ఒకదెక్కువ.'

'అల్లిద్దరికి పడకుంటెట్లయిందో? మునుపు నాల్గైదు నెల్లకింద అన్నదమ్ముల్తీరు కల్సుఁడె టోల్లు.'

'అల్లిద్దరు మంచిగున్న దినాల్లోనే — మా మల్లయ్యమావఁ, అందరం ఇజార్ల కూకున్నప్పుడు మాటమీద మాటచ్చి అన్నడు కదాంటె...'

'అప్పుడు రావిఁరెడ్డి ఉన్నడ?'

'అఁ ఉన్నడు కాని నువ్వు మద్దె మద్దెల అడ్డం రాకు.'

'ఇంతకు ఏవఁన్నడో చెప్పరాదు?'

'ఏవఁన్నడ? అందరనుకుంటూన్న మాటె అన్నడు. పోరగాండ్లకు పాలుపోసుడు బందుజేసి పాలపాడిని పెద్దపంతులమ్ముకుంటాన్నడట — అనన్నడు. అప్పుడు రావిఁరెడ్డి ఎట్ల లేసిండనుకున్నవు! నేనైతే మా మల్లయ్యమావఁ ఈపు పగుల్తదనే అనుకున్న కాని అంతదన్క రాలే! ఐనా మా మావఁను ఇట్టవఁచ్చినట్లు తిట్టుండు రావిఁరెడ్డి. పెద్దపంతుల్ను ఎనికేసుకుని తెగసీతుల్లెప్పిండనుకో.'

"ఎనికేసుకోడా మరి? మూౘ్రూపాయెలత్తె ముప్పై రూపాయెలన్న రావిఁరెడ్డికి ఇచ్చెటోడట పెద్దపంతులు. ముప్పై రూపాయెలంటె మాటలను కున్నర? మనం ముగ్గురం కలిసి ఐదురోజాలు

కూలి చేసైగూడ సంపాయిచ్చలేము."

'గల్లున్నప్పుడు మరి ఇద్దరికి పడకుండెట్లైంది?'

"ఇన్నోజులు యే లోకవ్వులున్నవురా అరె పిన పోసిగా? చింతకింది వర్పడు లేడు? అని పెద్ద బిడ్డ లచ్చి తెల్వగద? దాంతోనే ఇద్దరి నడుమల అగ్గిపుట్టింది. ఆ లంజె ఇద్దరి పక్కల్లల్ల బొర్లు కుంటనె. ఇద్దరికి తాకులాట బెట్టిచ్చింది. దాని కొరకు ఇద్దరి నడుమల పోటీలు పెరిగినయి. ఒగల మీద ఒగలకు ఈర్సె బుట్టింది. రుసరుసలు మొద లయినయి. కోపాలు పెరిగినయి. నువ్వెంతంటె నువ్వెంతనుకున్నరు. చెప్పల్దాక గూడ పోయిం దట ఆఖరికి. ఓసారి దానింట్ల ఇద్దరు కలెబడ్డరని గూడ అంటరు. అప్పట్నుంచి ఇద్దరు ఏరై పోయిండ్రు. పగోల్లనడుమల ఇచ్చి పుచ్చుకును దెక్కడుంటది? ఇప్పుడు పాలపొడి రూపాయిలు పంతులోక్కడె మింగుతాండె, తిన్నపానం ఊకుంటద?"

"యెట్లూకుంటది? ఊకునేతందుకు రామిరెడ్డే మన్న సిన్నోడ? పీపి యవ్వ కడుపుగాల - తెలి వంటె తెలివె ఆయింది. పెద్ద పంతులు పాలపొడి అమ్ముకుంటాన్నడని దర్కాసు రాసి పంపిచ్చిండట మీదికి. కాని పంతులేమన్న తక్కువ తిన్నడను కున్నవ? లెక్కలన్ని బరాబర్గ సూపెట్టిండట తాగిపిచ్చి. తినిపిచ్చి 'బి డి వోసు' కట్టుకున్నడట. ఆఖరికేమైందనుకున్నవ్? పెద్ద పంతుల్ను తబాదిలా చేయాల్నా పాపం ఏం తప్పు జేయని ఇంకో పంతులు - మా యింట్లుండెటోడు - పంతులంటె ఆయెన పంతులు - ఆయిన్ను తబాదిలా జేసింరు. పాపం ఆ పంతులు లబోదిబోమని ఒకటే మొత్తు కుండు."

"మరి బస్తాలకు బస్తాలు పాలపొడి అమ్ము కుంటాండె తెలిసిపోద యేంది?"

"ఏ బుర్ర వట్టి మట్టిబుర్రర పోసిగ. ఇంటి వస్తు, నీ సొంతవస్తు అనుకుంట ఎన్నెన్నో అసులు చేసినప్పుడుగాకుంట పంచాయితోల్ను మింగి సీల్దాగుతాండె తెల్వాంద యేంది? యిదిగూడ గంతె. పోరగాండ్లకు పొయ్యాక పోసినట్లు రాసు కుంటె కతం. యెట్ల పట్టుకోవత్తది? పట్టుకున్నా గాని యెన్నెన్ని ఉపాయాల్లెవ్వు తప్పించుకునే తందుకు?"

ఒకప్పు బస్తాకు ఇన్నూర్రున్నంచి మున్నూరు దాంక నట. గసొంటి బస్తాలు మన బడికి నెలకు రెండు తెస్తడు. నెలకొక్కటమ్ముకున్నాగాని యాడాదికి ఎన్ని రూపాయలనుకున్నావ్. అబ్బో మనం లెక్కబెట్టలేం ... మన పెద్ద పంతులు సిన్నగ సంపాయించిండనుకున్నవ? అబ్బాతే బంగుల కట్టిచ్చిండట. ఇక్కడ ఈ పూల్లె రెండెకురాల పొలంగొనె. మీరు చూసిండ్రో. చూల్లేదోగాని, ఆయెన పెండ్లం మెడనిండ నగలె. ఇంక చిల్లర మల్లరోల్లకు నగలుంచుకోని అడ్డికిగూడ యిత్తడట రూపాయిలు. మీదికెల్లి ఎంత తియ్యగ మాట్లాడుత డనుకున్నవ్? అప్పం తేనెబూసిన కత్తే. అసొంటోనికి దేవుడంటె చెప్పరానంత బకితి!"

వాళ్ళలో ఉత్సాహం పుట్టుకువచ్చింది. నిద్ర వాళ్ళ కళ్ళనుండి లేచిపోయింది. గుంజలకు చేరగిలబడ్డవాళ్ళల్లా సరిగా సర్దుకుని కూర్చున్నారు.

బలమైన రెండుచేతులుతప్ప ఏలాంటి ఆస్తి లేని అనామకులైన వాళ్లు, ఎన్నడూ మనసులు విప్పి మాట్లాడిఎరగని అస్వతంత్రులైన ఆ ముగ్గురూ-ఆరాత్రి ఊరికి దూరంగా అడ్డులేకుండా, అదుపులేకుండా హాయిగా మాట్లాడుకుంటున్నారు. అట్లా మాట్లాడుకుంటూంటే ఎక్కడలేని శక్తి వచ్చింది వాళ్లకు. ఆ శక్తి కృత్రిమమూ, క్షణి కమూ ఐనా, అదే వాళ్ళ బీటలువారిన అంతరంగా లలో పన్నీటిజల్లు కురిపిస్తూంది.

'అది బొందభకితి. పోరగాండ్ల నోర్లుకొట్టి దొంగతనంగ, లంగతనంగ సంపాయిచ్చి దేవున్ని మొక్కంగనె దేవుడు సల్లగ సూత్తడనుకున్నవ? సూడడు. తప్పుజేత్తె తప్పక పాపం తగులద్ది."

'అఁ. ఈ దినాలల్ల తప్పెక్కడిది? ఒప్పె క్కడిది? పాపమెక్కడిది? పుణ్యమెక్కడిది? బలంఉన్నోన్నె. పైసఉన్నోన్నె దేవుడు సల్లగ సూత్తాండు.'

'జాజా- గంతె. పాపంలేదు. పుణ్యంలేదు

---

ఒకగుమాస్తా ఎప్పుడూ అప్పుల్లో అవ సలు పడుతున్నాడు. తోటిబ్రహ్మచారి ఎలాగైనా అతనిబడ్జెట్ సరిచేసిపెట్టాలనుకుని "బ్రదర్ నీ జీతాన్ని నీవు ఎలాఖర్చు పెడు తున్నావో చెప్పు" అన్నాడు.

అందుకా ముసలిగుమస్తా "నూటికి 30 అద్దెకి 50 ఛండికి, 20 గుడ్డలకి, 10 మందు లకి, 5 చదువులకి" అంటూ చెప్పుకు పోతు న్నాడు.

"ఆగాడు. యిప్పటికే 15 మిగిలింది. 115 అయింది అన్నాడు.

"ఔను! ఆ మిగులే అప్పులు" అన్నాడు గుమస్తా.

---

అదంత ఎనుకట్నె పోయింది. సూడిండ్రి. లచ్చల కొద్ది ఇంతింత పెద్దబస్తాలు ఆ దేశం పేరేందో - అదేశపోల్లు మనదేశంల సదువుకునె పిలగాండ్లకని పున్యానికిదానంజేసి పున్యంగట్టుకుంటాంటె, మనోల్లేమో- పిలగాండ్ల నోర్లు కొట్టి దొంగతనంగా అమ్ముకుని పాపంగట్టుకుంట్రాండ్రు. మనోల్లు గిట్ల చేత్తాండ్రని తెల్సినాగూడ అల్లింకా ఎందుకు పంపిత్తాండ్రో?'

'అఁ అంతట జరుగుతాంద గిట?'

'మనూల్లైనైతే జరుగుతాంది గద! అన్నూర్లు మనూరసొంటియి గద?'

'ఐతే. నువ్వనేది ఈ పపంచంల మంచోళ్ళు లేరనేగద?'

'మంచోళ్ళ? ఎవనికాడె మంచోడు. ఎవ న్నన్న నువ్వుమంచోడవి కాదను మక్కెలిర దంతడు '

'అది నువద్దెనుకో. కాని మంచోళ్ళుండేది యెప్పుడైన కొద్దిమందే.'

'ఆ. ఆ కొద్దిల నువ్వొకనివి.'

'ష...నోర్లు మూసుకోండి' అల్లక్షాండ్రు'

'యేరి?'

'అదేంది...' — వేలుపెట్టి చూపించాడు. వాగు ఒడ్డుదాటి ఒక ఎడ్లబండి వస్తున్నది.

'అది అల్లదేనంటవా?'

'గీ దొంగరాత్రి యిటు దిక్కచ్చె బండెవర్దుం టది?'

ముగ్గురూ సర్దుకుని తయారుగా కూర్చున్నారు. వాళ్ళ కుడిచేతులు, వెంట తెచ్చుకున్న వెదురు గుతు పల్ని పట్టుకుని ఉన్నాయి. గుడిసెలోని చీకటి, తన ఒడిలో వాళ్ళను దాచుకుని బయటకు కనిపించ కుండా చేస్తున్నది.

ఛాయామాత్రంగా కనిపించే బండి, పాఠశాల వైపు రాసాగింది. కంకరరాళ్ళపై బండి నడిచి నప్పుడల్లా చక్రాల ఇనుప కమ్ములు చప్పుడు చేస్తున్నాయి.

కొద్ది నిముషాల్లో బండి వచ్చి బడిముందు ఆగింది. బండిలోంచి ఇద్దరు మనుష్యులు దిగారు.

"ఆయన పెద్ద పంతులు. ఇంకోడెవడు?"

"ఎవడో మనసొంటి కూలోడు. ఎవడైతేంది?"

"లంజెకొడుకుల్లాల మాట్లాడకుండ్రి."

హెడ్మాస్టరు ప్రొద్దున వేసుకున్న దుస్తుల్లోనే ఉన్నాడు. కాని చెప్పుల వంతుకు కాళ్ళకు బూట్లు వేసుకున్నాడు. చెవులచుట్టూ మఫ్లర్ చుట్టుకున్నాడు. చేతిలో టార్చి ఉంది.

అయన మౌనంగా వెళ్ళి ఒకగది తాళంతీశాడు. తలుపులు తెరచి లోపలికి వెళ్ళాడు. బండిమనిషి ఆయనను అనుసరించాడు. రెండు మూడు నిము షాలకు అటొకరు, ఇటొకరుపట్టి ఒక బస్తాను తీసుకువచ్చి బండిలోవేశారు. మళ్ళీ వెళ్ళి మరో బస్తా తెచ్చారు. చేతులు దులుపుకుని హెడ్మాస్టరు గది తలుపులు మూసి తాళం వేశాడు.

వెళ్ళి బండిలో కూర్చున్నాడు. అదివరకే బండి మనిషి బండిలో కూర్చుండి ఎడంచేతిలో పగ్గాలను, కుడిచేతిలో ములుగర్రను పట్టుకున్నాడు. హెడ్మాస్టరు టార్చ్‌ని వాచీకేసి ఫోకస్ చేసి టైం చూసు కుని అన్నాడు :

"ప ట్నం దు న్న ర. రెండుగంటల్లోపల చేరాలె పోనీ!"

బండి కదిలింది.

మరుక్షణంలో యమభటుల్లాంటి ముగ్గురు మను ష్యులు గుడిసెలోంచి పరుగెత్తుకువచ్చి బండి కెదు రుగా నించునేసరికి బండిలోని ఇద్దరూ నోళ్ళు తెరిచారు.

"బండాపుండి." - ముగ్గురిలో ఒకడన్నాడు.

"బండ్లెనుంచి దిగుండ్రిద్దరు. ఊఁ జల్ది —" మరొకడన్నాడు.

మూడోవాడన్నాడు. "సాయిగా! మేవిందరం యిక్కడుంటం ఉరికిపొయ్యి నువ్వు రామిరెడ్డిని పిల్చుకరా పో "

ఆశ్చర్యంతో. భయంతో. లజ్జతో నిశ్చేష్టుడై పోయిన హెడ్మాస్టరుకు జరిగిందేమిటో ఇప్పుడర్థ మయింది అర్థమయాక కళ్ళముందు చీకటి తప్ప ఏమీ కనిపించలేదు. గుండె ఆగినంత పనయింది.

# బ్రతుకు బాటలు



ఫొటో : కె. వి. ఎ. స్వామి

నరాలు పట్టుతప్పిపోయాయి.

కుంగిపోతున్న మనస్సును అదుపులోకి తెచ్చుకోవడానికి ఆయనకు రెండుమూడు నిముషాలు పట్టింది. ఒక విధమైన మొండితనం ఆయన్ని ఓదార్చింది. గడించిన అనుభవం ఆయన కళ్ళ ముందు అలుముకున్న చీకటిలో దీపం వెలిగించింది.

రామిరెడ్డి కొరకు వెళ్ళడానికి ఉద్యుక్తుడైన మనిషిని వారించి, తన స్వరంలో మార్దవాన్ని, వాత్సల్యాన్ని నింపుకుని ఆయన వాళ్ళనడిగాడు.

"మిమ్మల్ని పంపించింది ఎవడు?"

"......" — ఆయన ఏదో ఎత్తు ఎత్తుతున్నాడని వాళ్ళు గ్రహించారు.

"రామిరెడ్డి కాదూ?"

"..............."

"ఆయనకెట్లా తెలిసింది ముందుగా ఈసంగతి?"

"ఏమో మాకేం తెల్సు?"

భుజాలపై గొంగళ్ళు వేసుకుని, చేతుల్లో కట్టెలు పట్టుకుని యమభటుల్లానిలుచున్న ఆ ముగ్గురు మనుష్యులనూ పరీక్షగా చూచాడు హెడ్మాస్టరు.

వాళ్లు మానవ రూపంలో ఉన్న కీలుబొమ్మలని, ఆడించినట్లల్లా ఆడతారని, వాళ్ళను ఆడించడం బహు తేలిక అని ఆయన గ్రహించాడు.

నిజమే — ఆయన సరిగానే ఊహించాడు. వాళ్ళ చైతన్యం గోరీ కట్టబడి యుగాలు గడుస్తున్నది. గోరీలను త్రవ్వడం సులభమేమీ కాదు. వాటికి కాపలావుండే రాక్షసుల్ని నిర్జించడం మాటలతో అయ్యేపనికాదు. ఈ కార్యసాధనకు తగినవాళ్లు ఒక కష్టజీవులే. హెడ్మాస్టరూ, హెడ్మాస్టరు పక్షం వాళ్ళూ దీన్నెరుగుదురు. అందుకే కష్టజీవుల నిజమైన మిత్రులందరినీ వాళ్ల దేశద్రోహులుగా చిత్రిస్తున్నారు. చిత్రిస్తూ తమ చేతుల్లో ఉన్న తుపాకులను పేల్చి పిట్టలను కాల్చినట్లు కాల్చిపారేస్తున్నారు. దబ్బును పగ్గాలుగా చేసి, మతం అనే రంగులో ముంచి, ఆ పగ్గాంతో వాటికి కళ్ళెం వేసి, వాటిని గట్టిగా పట్టుకున్నారు జారిపోకుండా.

ఇప్పుడు జరిగే సంఘటన ఈ విధానంలో చిన్న బిందువు ప్రమాణం కలది మాత్రమే.

హెడ్మాస్టరు తన కంఠంలో లౌక్యాన్ని నింపుకున్నారు. ముగ్గురు మనుష్యుల్లోని ఒకతని భుజంపై చేయివేసి చిన్నగా, దయగా నవ్వుతూ అడిగాడు:

'ఆయన మీకెన్ని రూపాయ లిచ్చిండు?'

'నవ్రొండు రూపాయలు.'

హెడ్మాస్టరు దొడ్డుపెదవులు ఉమ్మెంత కాయలా విచ్చుకున్నాయి. అజ్ఞానంలో పడికొట్టుకుంటున్న పామరులను చూసి సర్వజ్ఞుడైన సాధువు జాలిగా, సానుభూతిగా, హేళనగా చూసినట్లు చూశాడు ఆయన వాళ్ళను. పాంటుజేబులో చేయిపెట్టి నోట్ల కట్టను బయటికి తీశాడు. ఐదు రూపాయల నోట్లను మూడింటిని తీసి మిగతా నోట్లను తిరిగి జేబులో పెట్టుకున్నారు.

ఆ ఐదు రూపాయలనోట్లను ఊపుతూ అన్నారు:

'తీసుకోండ్రి.'

'ఇదేంది?'—వాళ్ళ కేంచేయాలో అర్థంకాలేదు. కుక్కలు బొక్కనుచూపి కొట్టించినట్లుంది వాళ్ళ పరిస్థితి.

'రామిరెడ్డి రెండిచ్చిండుగద? నేను నవరి ఐదు రూపాయలిస్తాన్న. తీసుకోండ్రి.'

ఎందుకిస్తున్నాడో వాళ్ళ కర్థమయింది. ఐదు రూపాయలంటే రెండురోజుల కూలీ, అదికూడా వాళ్ళకర్థమయింది.

'కాని...కాని.....రామిరెడ్డి సంగతేమిటి?'

వాళ్ళ సందేహాన్ని గ్రహించాడు హెడ్మాస్టరు. సీరియస్‌గా అన్నాడు:

—ఆయనేం పులికాదు మింగేటందుకు. ఈ రూపాయలు తీసుకుని ఎవరిండ్లకు వాళ్ళుపోయి హాయిగా పడుకోండ్రి. రేపు ఆయనడిగితే - తెల్లారేవరకూ ఉన్నం, ఎవరూ రాలేదని చెప్పండ్రి."

ఉపాయం బాగానేవుంది. కాని—

"ఊఁ ఇంకో నవరి రెండ్రూపాయలిస్తాన్న. తీసుకోండ్రి.." అని జేబులోంచి రూపాయనోట్లను తీసి, ముగ్గురిలో ఒకని చేయి పట్టుకుని వ్రేళ్ళు తెరిపించి ఆ చేతిలో పెట్టాడు హెడ్మాస్టరు.

పెట్టి అన్నాడు: "రేపు సాయంత్రం మాయింటికి రాండ్రి. పాలపొడి పెడత."

ముగ్గురిలో ఒక్కరూ మాట్లాడలేదు. పెదవులను కదుపుతున్నారు. ఏదో చెప్పాలనుకుంటున్నారు. కాని రూపాయలనోట్లు వాళ్ళ గొంతులను నొక్కివేస్తున్నాయి.

ఆకాశంలో చంద్రుడు నల్లనిమేఘం చాటుకు తప్పుకున్నాడు. భూమిపై వెన్నెలపోయి చీకటి అలుముకుంది.

బండిమనిషి హితబోధ చేస్తున్నట్లుగా అన్నాడు:

"మనం కూలోళ్ళం. ఎవల్లు కూలిత్తే, అల్ల సంకేతం. మనకు కూలి ముడితేసాలు. పనిషితో పనేదు. మీ రిప్పుడు పోయి అయింతో చెప్తరకు కోండ్రి. చెప్తే మీకేవన్న త్తదా ఏంరాదు. మీదికెల్లి ఈ ఏడ్రూపాయలుగూడ దొరుకయి. గండుకే నవ్వునేక ఈ రూపాయిలు తీసుకుని పోండ్రి. ఈ పెద్దసారు మంచోడు. ఎప్పుడెన్న అడుగుతె కల్గాగె తందుకు పైసలుగూడ ఇత్తడు. ఇప్పిచ్చె భారం నాది."

"ఆఁ ఆఁ. మీ కియకుంటే ఇంక ఎవళ్ళకిస్తా నేను?" — అన్నారు ప్రేమగా హెడ్మాస్టరు.

బండి మనిషీ, హెడ్మాస్టరూ కలిసి చివరకు ఎలాగైతేనేం - ఆ ముగ్గురు మనుషులను ఒప్పించారు.

బండి కంకరరాళ్ళ త్రోవగుండా చప్పుడు చేసుకుంటూ సాగిపోయింది. బండి కనిపించే వరకూ చూసి, ముగ్గురు మనుష్యులు వెనక్కు మళ్ళారు.

నల్లని మబ్బు తొలగిపోయి చంద్రుడు బయటపడ్డాడు.

'ఇప్పుడే పంచుకుందాం' — అన్నాడు ఒక మనిషి.

'ఆఁ, ఇప్పుడే.' — అన్నాడు రెండోవాడు.

ఎవరి ఏడురూపాయలు వాళ్లు తీసుకున్నారు.

వాళ్ళకు ఒకందుకు సంతోషంగా, ఒకందుకు భయంగా ఉంది.

'ఎవరిండ్లకు ఆల్లం పోదాం. తెల్లారి లేసినంక చూసుకోవచ్చు ఏమన్నైతే.'

'గట్లనే' — అన్నారు మిగతా ఇద్దరూ.

• • •

కాని వాళ్ళు అనుకున్నట్లు జరగలేదు.

త్రోవలోనే పంచాయితీ ప్రెసిడెంటు రామిరెడ్డి ఎదురయ్యాడు. ఆయన అప్పులిస్తే ప్రేవులు లెక్కపెట్టేరకం. అనుకున్నది సాధించేవరకూ వదలిపెట్టని కార్యసాధకుడు ఆయన.

వాళ్లు మొదట బొంకారు. బడి వద్దకు ఎవరూ రాలేదన్నారు. రాలేదని ప్రమాణాలు చేశారు. కాని వాళ్ళ మాటల్లోని తత్తరపాటే వాళ్ళను పట్టిచ్చింది.

జరిగిన విషయాన్ని వాళ్ళ నోటినుండి చెప్పించడానికి ఆయనకు ఐదు నిముషాలు కూడా పట్టలేదు.

అంతా విన్న ఆయనకు వికటమైన కోపం

వచ్చింది. కాని వచ్చిన కోపాన్ని వాళ్ళపైన ప్రయోగించడానికి అది సమయంకాదు. ఆ సమయాన్ని హెడ్మాష్టరును పట్టుకోవడానికి ఉపయోగించవలసి ఉంది.

'మంచిది. మీరు నాతోనే అబద్ధాలు చెప్తారు కాదు? పోండ్రి. పొయ్యి పడుకోండ్రి. మీ సంగతి రేపు చెప్త..'అంటూ గబగబా నడిచి వెళ్ళిపోయాడు.

మరో పావుగంటలో ఆయన వాగు అవతలి గట్టునున్నాడు. ఆయన చేతుల్లో సైకిలు ఉంది. ఆయన వెంబడి సైకిళ్ళతో నడుస్తున్న ఇద్దరు అనుచరులు కూడా వున్నారు.

అప్పటికి చంద్రుడు ఆకాశంలో ఓ మూలకు దిగిపోతున్నాడు. తెల్లని మబ్బులు పోయి నల్లని మబ్బులు వచ్చాయి. వెలుతురు తగ్గుతూ చీకటి చోటుచేసుకుంటున్నది. రాళ్ళదారి - సైకిళ్లెక్కడానికి అడ్డంకిగా ఉంది. అనుచరు లిద్దరికీ పూర్తి విశ్రమత్తు వదలలేదు. సైకిళ్ళను ఈడ్చుకుంటూ ఆ చీకట్లో ఆ రాళ్ళదారి గుండా రామిరెడ్డి వెంబడి నడవడం చాలా కష్టంగా ఉంది వాళ్ళకు. పైగా చల్లని గాలి వాళ్ళను రంపంలా కోస్తున్నది. రామిరెడ్డి ప్రోత్సాహంగాని, తిట్లుగాని వాళ్ళ నేవిధంగానూ ఉత్సాహపరచలేక పోయాయి.

పడుతూ లేస్తూ, వాళ్లు రోడ్డు చేరుకునే సరికి దాదాపు ముప్పావుగంట పట్టింది. రోడ్డుపైన వాళ్లు సైకిళ్లెక్కారు. శక్తి అంతా కాళ్ళలోకి ప్రవహించింది. పెడల్సు మొత్తుకున్నాయి. సైకిళ్ల రివ్వున దూసుకుపోయాయి.

పోగా పోగా ఛాయలా కదులుతున్న బండి కనిపించింది. బండి దగ్గరపడింది వాళ్ళకు. ఆ దేబ. సందేహంలేదు.

ఎదురుగా ఐదారు ఫర్లాంగుల దూరంలో బస్తీ లైట్లు కనిపిస్తున్నాయి. హెడ్మాష్టరు స్వంతగ్రామం ఆ బస్తీమే. ఇంకో అరగంట ఆలస్యమైతే ఆయన వీళ్ళకు చిక్కేవాడు కాదు. తలలు వ్రేలాడేసుకుని తిరిగి రావలసి వచ్చేది.

కాని ఎన్నాళ్ళనుండో పెద్ద గజదొంగలా స్వైరవిహారం చేస్తూ తప్పించుకు తిరుగుతున్న హెడ్మాష్టరు చిక్కిపోయాడు చివరకు! అదీ అతన్ని పట్టిన మరో గజదొంగకు!!

సైకిలును బండికెదురుగా ఆపి రామిరెడ్డి గర్జించాడు.

'దిగు.' —

బండి ఆగిపోయింది.

హెడ్మాష్టరు కళ్ళలో కాంతిలేదు. మొహంలో జీవంలేదు. మారుమాట్లాడకుండా దిగివచ్చి రామిరెడ్డికి దగ్గరగా నించున్నాడు. ఒక్కసారిగా సైకిల్ హాండిల్‌మీది రామిరెడ్డి రెండు చేతులు పట్టుకున్నాడు.

"చేతులుకావు"-దైన్యం నిండివుంది కంఠంలో.

"చేతులే."- అన్నాడు రామిరెడ్డి కోపంగా.

"మీరేదిక్కు....." - దిక్కుగాడుకూడ అట్లా పలికాడు.

"గిన్నుడు తెలిసిందా నేనే దిక్కని?"

"తప్పయింది. ఇప్పుడు నా తప్పు తెలుసుకున్నా".

"మాటల్తోటి నన్ను బోల్తా కొట్టించలేవు."

"కాదు, కాదు. నేను నిజమే మాట్లాడుతున్నా."

"నువ్వు నిజం మాట్లాడిందెప్పుడు?

"మీ రెట్లైనా అనుండ్రి. పడ్తా. పిల్లలుగలోన్ని. ఉద్యోగం పోయిందంటె అందరం విషం పెట్టుకోవాలె. ఇన్నేండ్లు దొరతీరు బతికినా. ఇప్పుడు దొంగన్న పేరు మొయ్యలేను."

"ఉత్త పేరెందుకు మోస్తవునువ్వు. దబ్బు సంచులు మోసేదోనివి?"

"మీకు తెలవందా నా తాపత్రయం."

'నీ తాపత్రయంతో నాకేంపని?'

'పని మీక్కాదు - నాకే. ఈ ఒక్కసారికి విడిచి పెట్టుండ్రి. ఇప్పట్నుంచి మీరు చెప్పినట్లు వింటా?

విన్నిదిచి పెట్టాల్నా?'

'నా జన్మలో నేనెవరిముందూ తలవంచలేదు.'

'నా జన్మలో నే నెవళ్ళనూ విడిచిపెట్టలేదు.'

'కాని, నాకే ఉపకారం చెయ్యండ్రి. ప్రత్యుపకారం ఏంచెయ్యమన్నా చేస్త.'

'నీ ప్రత్యుపకారం ఎవనిక్కావాలి?'



'మరి?......'

'మూడు వేల రూపాయలియ్యి. ఇడిచిపెడ్త.'

'మూడువేలా?'

'ఆ. మూడువేలు. నువ్వీ దొంగ వ్యాపారంలో ఎంత లేదన్నా ఇప్పటికి పదివేలన్నా సంపాయించి ఉంటవ్.'

'కాదు......'

'నువ్వు చెప్పేపని లేదు. నీ సంగతంతా నాకు తెల్సు. కాని నా గురించే నీకు సరిగా తెలువది. నౌకరి ఎక్కువో, మూడువేలెక్కువో ఆలోచించుకో జల్ది.'

"మీరు పెద్దలు."

"నువ్వు గుర్తుచెయ్యవల్సిన పన్లేదు."

"దయసంపలిస్తా..."

బేరం సాగింది. నిజాన్ని పాతిపెట్టి గోరీకట్టే పనికి బేరం సాగింది. పట్టువిడుపులు నడిచినై. చివరకు పన్నెండు వందలుగా (దాన్నేమనాలి?— కూలీ అనా? ధర అనా?) ఇద్దరూ అంగీకరించారు.

పట్టిన చెమటను తుడుచుకుంటూ హెడ్మాష్టరు అన్నాడు:

"మంచిది ఇస్తా."

"ఇస్తాగాదు. ఇయ్యాలె."

"ఇస్తానంటున్నగదా"- ఒకవైపు వణికిపోతున్నా, మరొకవైపు తనకు చెమట పట్టడంలోగల తన అసాధారణ స్థితి గుర్తుకువచ్చి హెడ్మాష్టరుకు చాలా విచారం కలిగింది.

"నువ్వంటే ఎవరు నమ్మతరు? తిమ్మిని బమ్మిగ, బమ్మిని-తిమ్మిగ చేసి చూపించే జిత్తుల మారివి నువ్వు. రేపు పన్నెండు నూర్లు కాదుగద, పన్నెండు పైసలుగూడా ఇచ్చేది లేదంటే ఏం జేయ్యాలె? ఇప్పుడే ఇచ్చేయి."

"ఇప్పుడా!"

"ఆ ఇప్పుడే."

'ఈ రాత్రి పన్నెండు వందలు ఎక్కడ దొరుకుతై?'

'ఎక్కడ దొరికేదికూడ నేనే చెప్పాల్నా యేంది?'

హెడ్మాష్టరు వేడుకున్నాడు. ప్రమాణాలు చేశాడు. కాని రామిరెడ్డి వదలలేదు.

ఒకరి సంగతి ఒకరికి బాగా తెలుసు.

చివరకు అందరూ కలిసి బస్తీ చేరుకున్నారు. హెడ్మాష్టరు వాళ్ళను తీసుకువెళ్లి తన ఇంటిముందు నిలుచుండబెట్టాడు. డబ్బు తేవడానికి తాను లోనలకి వెళ్లాడు.

ఇంట్లో డబ్బు తయారుగా లేదు. అంత రాత్రి ఎవరి దగ్గరకు వెళ్తే ఎవరిస్తారు? పెట్టెలు తెరచి నగలు తీస్తున్న హెడ్మాష్టరును చూసి పరిస్థితి అర్థంకాక, ఆడవాళ్ళు బుడిబుడి దీర్ఘాలు ప్రారంభించారు. అనతికాలంలో ఆ దీర్ఘాలు ఏడ్పులుగామారిపోయినై.

నగలను తెచ్చి రామిరెడ్డి చేతుల్లో పెట్టాడు హెడ్మాష్టరు. చచ్చినకొడుకును శ్మశానానికి తీసుకుపోవడానికి అప్పగించినట్లుంది అతని వాలకం. ఏడ్పును దిగమింగుతూ అన్నాడు:

'ఇవి ఎనిమిది తులాల బరువున్నాయి. దాదాపు పదిహేనొందల ధర చేస్తయి.'

'పన్నెండు వందలకు మించి పైసాకూడ తీసుకోను నేను. అవి తెచ్చి నీ నగలు నువ్వు తీసుకపోవచ్చు.'

బండి అక్కడే ఆగింది. సైకిల్లు బయలుదేరాయి.

ఈ సారి సైకిల్లు మెల్లిగా నడవసాగాయి. అనుచరులిద్దరూ తనను పొగడుతూంటే వింటూ, ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ హుషారుగా ఈల వేయసాగాడు రామిరెడ్డి.

చంద్రుడు కనిపించకుండా వెళ్ళిపోయాడు.

అంతటా చీకటి వ్యాపించింది. అప్పుడప్పుడు రోడ్డువెంట వెళ్ళే లారీల రొదతప్ప ఏ శబ్దమూ లేదు.

కాని ఆ రాత్రి-వ్యాపించిఉన్న ఆ నిశ్శబ్దంలో, ప్రకృతి యెదను చీల్చుతూ శబ్దంరాని రోదన పైకు గుబు తీస్తున్నది. బహుశః ఆ రోదన దిక్కులంత లాన్నంతా ఆవరించి ఉన్న చీకటిది కావచ్చు.

— చీకటి ఏడుస్తున్నది!

— నిజం నిజం. ఆ ముగ్గురిని తనలో ఇముడ్చుకోలేక, తనలో తాను కుమిలిపోతూ చీకటి ఏడుస్తున్నది!!

★